# వైభవంగా శ్రీ ఉమామహేశ్వర్లకు.. పల్లకి మహోత్సవం..!

**బనగానపల్లెరూరల్ ,జూన్ 3, ప్రభాతవార్త:**
బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం నందు సోమవారం సందర్భంగా శ్రీ స్వామిఅమ్మవార్లకు వైభవంగా పల్లకి మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకి నందు కూర్చుండజేసి నందిమండపంలో వేంచేపుచేసి ప్రదోషకాల పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ స్వామివార్లకు శాస్రోక్తంగా మరియు వైభవోపేతంగా పల్లకి మహోత్సవాని ్న నిర్వహించారు. తదనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ



కార్యనిర్వహణాధికారి బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, మీరాపురం బత్తుల భాస్కర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ శర్మ, లోకనాథ్ శర్మ, దేవుడు, రాఘవేంద్ర శర్మ, ఆలయ సిబ్బంది రమేష్ బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు | నంద్యాల
# వార్త
4 జూన్, 2024 మంగళవారం పేజీలు 4




## వేదావతికి భారీగా చేరిన వరదనీరు..!

**హొళగుంద,జూన్ 3,ప్రభాతవార్త**
గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని మార్లమడికి గ్రామం వద్ద ఉన్న వేదావతి నదికి వరదనీరు భారీగా చేరింది. గుంతకల్,గుత్తి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో అక్కడ వాగులు,వంకలు పొంగిపొర్లి వేదావతి నదికి నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వేదావతి నదిపై ఆధారపడిన రైతులకు వేదావతికి వరదనీరు రావడంతో విత్తు విత్తేందుకు రైతులు సిద్దమవుతున్నారు.

# కౌంటింగ్‌కు.. సర్వం సిద్ధం..!

: శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఏర్పాట్లు
: ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్
: జిల్లా కలెక్టర్‌జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

2లో

**ప్రజల శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా, కౌంటింగ్ ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్‌జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పోలీసుల సమిష్టి కృషితో పోలింగ్ కి ముందు, పోలింగ్ తర్వాత ప్రశాంత వాతావరణం ఉందని, కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండేందుకు శాయశక్తులా మేము ప్రయత్నం చేస్తామని, ప్రజలు కూడా సహకరించాలని కలెక్టర్ కోరారు. కర్నూలు జిల్లాలో 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ ఆఫ్ పోలీస్ అమలులో ఉందని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా సెంటర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లపై ఎస్పీతో కలిసి జిల్లా కలెక్టర్‌జిల్లా ఎన్నికల అధికారి డా జి.సృజన ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.**

**కర్నూలు, జూన్ 03, ప్రభాతవార్త :**
4వ తేదీ జరగబోయే కౌంటింగ్ కొరకు సంబంధించి కౌంటింగ్ హాల్ ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఇచ్చే శిక్షణ తరగతులు విషయంలో కావచ్చు, రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కమ్యూనికేషన్ సెంటర్, అబ్జర్వర్ల సీటింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, ఎలక్ట్రిక్ కనెక్షన్స్ ఏర్పాటు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ సిస్టం, ఫైర్ సేఫ్టీ, సీసీ కెమెరాల ఏర్పాటు ఈ విధంగా కౌంటింగ్ హాల్ లోపల చేయాల్సిన ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్ బయట చేయాల్సిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసుకోవడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి హాల్‌లో రౌండ్ అయిపోయిన తర్వాత కౌంటింగ్ హాల్ నుంచి వచ్చిన ఇన్ఫర్మేషన్ మీడియా వారికి తెలియచేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ చేయడానికి గాను సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలను జిల్లా ఎస్పీ తీసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న వాళ్ళు ప్రభుత్వంలో ఉంటారని, ప్రశాంతతకు భంగం కలిగించకుండా ప్రజల యొక్క నిర్ణయాన్ని గౌరవిస్తూ ఎన్నికల ప్రక్రియని పూర్తి చేయటంలో అందరూ కూడా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.
జిల్లా యంత్రాంగం, పోలీసుల సమిష్టి కృషితో పోలింగ్ కి ముందు, పోలింగ్ తర్వాత ప్రశాంత వాతావరణం ఉందని, కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండేందుకు శాయశక్తులా మేము ప్రయత్నం చేస్తామని, ప్రజలు కూడా




సహకరించాలని కలెక్టర్ కోరారు. జూన్ 4వ తేది రాయలసీమ యూనివర్సిటీ చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధిలో అన్ని కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్, షాపులని మూసివేయడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈరోజు, రేపు, ఎల్లుండి మూడు రోజులు ఎక్కడ లిక్కర్ అమ్మకాలు అనేవి లేకుండా పూర్తి స్థాయిలో నియంత్రణ ఉంటుందని, లిక్కర్ తో పాటుగా లూజ్ ఫ్యూయల్, పెట్రోల్, డీజిల్ లాంటివి అమ్మే అవకాశం ఉండదని రూల్స్‌ని అతిక్రమించి ఎవ్వరైనా అమ్మితే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. అదే విధంగా బాణాసంచా కూడా అమ్మకుండా చర్యలు తీసుకున్నామని, డ్రోన్ ఫ్లయింగ్ వాటికి పర్మిషన్ లేదని కలెక్టర్ తెలిపారు. మీడియా వారికి మీడియా సెంటర్ వరకు మొబైల్ ఫోన్లను అనుమతించడం జరుగుతుందని, అప్పుడప్పుడు కొంత మంది మీడియా వారిని కౌంటింగ్ హాల్స్ లోకి విజువల్స్ తీసుకొనుటకు గాను తీసుకొని వెళ్లడం జరుగుతుందని, అప్పుడు మాత్రం మొబైల్స్ తీసుకొని వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు..
జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా భద్రత పరంగా తీసుకోవాల్సిన అని రకాల చర్యలను తీసుకోవడం జరిగిందన్నారు. రెండు రకాల బందొబస్తు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, కౌంటింగ్ సెంటర్ వద్ద ఒక బందొబస్తు, కర్నూలు జిల్లాలో సబ్ డివిజన్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మరొక బందొబస్తును ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ గైడ్లైన్స్ ప్రకారం 4 అంచెల భద్రత

## ఓట్ల లెక్కింపు సిబ్బందికి.. రెండవ విడత ర్యాడమైజేషన్ పూర్తి



**నంద్యాల, జూన్ 3,ప్రభాతవార్తప్రతినిది**
సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వమన కోసం రె ండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా 746 మంది కౌంటింటు సిబ్బందిని అరు నియోజక వర్గాలకు కేటాయించడము జరిగిందని జిల్లా ఎన్నికల అదికారి డాక్టరు కె.శ్రీనివాసులు చెప్పారు. సోమవారము కెలెక్టరేట్లఓని అయన చాంబరులో ఎన్నికల కౌంటింగు ప్రక్రియ పరిశీలించడానాకి ఎలక్షన కమీషన ద్వారా జిల్లాకు కేటాయించిన అబ్జర్వర్ల సమక్షంలో కౌంటింగు సిబ్బంది రెండవ విడత ర్యాడమైజేషన్ ప్రక్రియను కలెక్టరు నిర్వహించారు.ఈసందర్భముగా కలెక్టరు మాట్లాడుతూ బాతర ఎన్నికల కమీషన్ సూచించిన ప్రత్యే క సాఫ్ట్‌వేర్ ద్వారా మే 24వ తేదివ తేది కౌంటింగు సిబ్బంది మొదటి విడత ర్యాడమైజేషన్ ప్రక్రియ ద్వారా 120శాతము రిజర్వుతో కలిపి మొత్తం 746మంది కౌంటింగు సిబ్బందిని నియమించడము జరిగిందన్నారు. ఇందులో221 మంది కౌంటింగు సూపరువైజర్లు 278 మంది కౌంటింగు అసిస్టెంట్లు 247 మంది మైక్రో అబ్జర్వర్లను అరు నియోజక వర్గాలకు కేటాయించామని కలెక్టరు చెప్పారు. రెండో మవిడత ర్యాండమైజేషన్ నియమించిన సిబ్బందికి కూడా వెంటనే కౌంటింగు శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. జూన్4వ తేది కౌంటింగు రోజు ఉదయం 5గంటలలకు 3వ విడత ర్యాడమైజేషన నిర్వహించి ఏటేబుల్‌లో కౌంటింగు నిర్వమించాలోతెలపడము జరుగుతుందన్నారు

## వర్షం నీటితో చెరువును తలపిస్తున్న ప్రభుత్వ వైద్యశాల

**నందికొట్కూరు,జూన్ 3,ప్రభాతవార్త:** ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి స్తానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ అంత చెరువును తలపించే రీతిలో నిండి పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఇటీవలే కోటా ్లది రూపాయలతో ఆస ్పత్రిని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. అయితే ఆస్పత్రి ఆవరణంలో కాంట్రాక్టర్లు సరి అయిన రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడం వలన ఎగువ నుండి వచ్చే వర్షం నీరు ఆస్పత్రిలోకి చేరుతుండడంతో రోగులు, వారి కొరకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఇక్కడ వైద్యం కొరకు వస్తారని అధికారుల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వైద్యశాలలోకి వర్షం నీరు వస్తున్నదని, కోటాది రూపాయలతో ఆధునీకీకరణ చేశారని అయిన ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని వెంటనే పరిష్కారించాలని సిపిఐ జిలా నాయకులు వి.రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనువాసులు డిమాండ్ చేశారు.



# దంచి కొట్టిన వర్షం.. ఉప్పొంగిన వాగులు..!

- రాక పోకలు బంద్
- జలమయమైన కోవెలకుంట్ల ఆర్టిసిబస్టాండు
- పిడుగు పాటుకు ఇద్దరి పరిస్థితి విషమయం
- ముఖం వాచిన ప్రజలకు ఊపిరినిచ్చిన వర్షం





**నంద్యాల, జూన్ 3,ప్రభాతవార్తప్రతినిధి**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది వర్షపుదాటికి వాగు వంకలు పొంగి ప్రవహించగా పొలాల్లో ఉన్న గొర్రెలు వాటిని మేపు కాపులు గజ గజ వనికారు. అలాగే కోవెలకుంట్ల అర్టిసి బస్టాండు జలమయమైంది. వివరాలోకి వెళ్లితే అదివారము రాత్రి 11గంటల నుండి సోమవారము ఉదయం 9గంటల వరకు వర్షము ఎడతెరపి లేకుండా దంచ్చి కొట్టింది. జిల్లా వ్యాప్తంగా బనగానపల్లెలో అత్యందికముగా వర్షపాతము నమోదుగా అత్యల్పంగా గడివేముల మండలంలోని నమోదు అయింది.ఈ వర్షదాటికి అదివారము సాయంత్ర పిడుగు పాటుకు ఇద్దరి వ్యక్తులు అపస్మారక స్తితిలోకి వెళ్లారు. అందులో బాగంగా వర్షము రాకతో మొఖము వాచి ఉన్న ప్రజలకు యూరట నిచ్చింది.అలాగే కోవెలకుంట్ల, వల్లంపాడు గ్రామాల మద్యన ఉన్న నల్లవాగు, కైపవాగు, ఉప్పొంగడముతో రాక పోకలు పూర్తిగా బంద్ అయ్యాయి జిల్లా 1వ తేది నుండి వాతావరణములో మారు ్ప వచ్చిన 21వ తేది రాత్రి 11గంటలు దాటిన తరా ్వత వర్షము ఇరగదీసింది.అందులో బాగంగా జిల్లాలోని బనగానపల్లెలో 178.8యంయం,పాణ్యంలో 153.6యంయంశ్రీశైలంలో 144.8యంయం, అత్మకూరులో84.2యంయం,నందికొట్కూరులో 80.2యంయం, జూపాడుబంగ్లాలో 77.4యంయం, కొలిమిగుండ్లఓ 75.4యంయం, అవుకులో 66.2యంయం, కొత్తపల్లెలో 64.6యంయం, దొర్నిపాడులో63.2యంయం, పాములపాడులో 58.2యంయం,కోవెలకుంట్లలో 57.4యంయం, మిడుతూరులో 54.2యంయం, గోస్పాడులో50.6యంయం, అళ్లగడ్డలో47.2యంయం, మహానందిలో 44,2యంయం, పగిడ్యాలలో 38.6యంయం, రుద్రవరములో 35.4యంయం, నంద్యాలలో 34.8యంయం, డోన్‌లో 32,4యంయం, బేతంచెర్లఓల 30.2యంయం, ప్యాపిలిలో 28.2యంయం, వెలుగోడులో 27.6యంయం, ఉయ్యాలవాడలో27.0యంయం, బండిఅత్మకూరులో 26.6యంయం, సంజామలల్లో 20.4యంయం చాగలమర్రిలో 18.0యంయం శిరువెల్లలో 15.4యంయం, గడవేములల్లో 10.4యంయంగా నమోదు అయింది.,ఇందులో అత్యదికముగా బనగానపల్లెలో నమోదు కాగా అత్యల్పముగా గడివేముల మండలంలోని నమోదు అయింది.



## వాగులో పడి 50గొర్రెలు మృతి..!



**కోవెలకుంట్ల, జూన్ 3,ప్రభాతవార్త :**
చిన్నకొప్పెర్ల ,వల్లంపాడు గ్రామాల మద్య ఉన్న నల్లవాగులో పడి 50గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వివరాలోకి వెల్లితే అదివారం రాత్రి కురిసిన కుండ పోత వర్షంకు వల్లంపాడు, చిన్నకొప్పెర్ల గ్రామాల మద్య ఉన్న నల్లవాగు చాలా ఉదృతంగా ప్రవహించింది,అనంతపురం జిల్లా యాడికి మండలం గుడిపాడు గ్రామానిక చెందిన రామసుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డికి చెందిన గొర్రెల మందను అటు వైపుగా గొర్రెలను కాపర్లు మోపుకుంటు వచ్చారు. ఉన్నటుండి ఒక్క సారిగా మంద మొత్తం వాగులో కిదూకింది.దీనితో వాగు ఉదృతికి అందులో పడి 50గొర్రెలు మృత్యువాతన పడ్డాయి.దీనితో వాగులో మృతి చెందిన గొర్రెలను బయటకు తీశారు కళ్ల ముందు తమకు జీవ నాదారమైన గొర్రెలు మృత్యువాతన పడటముతో కాపర్లు లబోదిఅంటున్నారు. ప్రభుత్వం గొర్రెల కాపరుల బాదను అర్థము చేసుకుని పరిహారము అందించాలని కోరారు.

## మండలంలో కురిసిన వర్షం..!

- పొలాల్లో విత్తనాలు నాటుతున్న రైతులు
- వర్షం రాకతో రైతన్నల హర్షం

**మంత్రాలయం,జూన్ 3,ప్రభాతవార్త:**
మంత్రాలయం మండలంలో ఆదివారం రాత్రి భారీవర ్షం కురిసింది.సుమారు రెండు గంటలపాటు ఈ వర ్షం కురవడంతో పొలాల్లో వర ్షపునీరు వచ్చి చేరింది.ముఖ్యంగా మండల పరిధిలోని మాధవరం, రాంపురం, కాచాపురం, ఖగ్గల్లు, 52-బసాపురం, రచ్చుమర్రి, మాలపల్లి,సుంకేశ్వరి, పరమాన్ దొడ్డి, సింగరాజనహళ్ళి, వగరూరు, వి.తిమ్మాపురం, బూదూరు,సూగూరు,చిలకలదోణ,కల్లుదేవకుంట,చెట్నహళ్ళి,మంత్రాలయం గ్రామాల్లో ఈ వర ్షం కురిసింది. మండలంలో సుమారు 30.8 ఎంఎం వర ్షపాతం నమోదైనట్లు అధికారులు గుర్తించారు.మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో అనుకూలవంతమైన వర ్షం రావడంతో రైతులు తమ పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు.ముఖ్యంగా ఎర్రనేల భూముల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు.ఈ వర ్షం రాకతో అన్నిరకాల నేలల్లో విత్తనాలు నాటవచ్చని రైతులు తెలుపుతున్నారు.గత సంవత ్సరం తీవ్ర వరా ్షభావంతో తీవ్ర నష్టాలపాలైన రైతులు ఈ సంవత ్సరమైనా సకాలంలో వర ్షాలు వచ్చి రైతుల పంటలుపండి కష్టాలు తీర్చాలని రైతులు ఆ వరుణదేవున్ని కోరుతున్నారు.ప్రభుత్వం కూడా రైతులకు విత్తనాలు,ఎరువులు,క్రిమి సంహారక మందుల్లో రాయితీలిచ్చి ఆదుకోవాలని మండలంలోని గ్రామాల రైతులు కోరుతున్నారు.



## ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పక పాటించాలి

: శిక్షణ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ మైక్రో అబ్జర్వర్స్ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించండి : జిల్లా కలెక్టర్‌జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన

**కర్నూలు, జూన్ 03, ప్రభాతవార్త :**
కౌంటింగ్ రోజున ఎన్నికల నియమ నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ మైక్రో అబ్జర్వర్స్ ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్స్ సమక్షంలో మైక్రో అబ్జర్వర్స్ కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజక వర్గాల సాధారణ పరిశీలకులు జాఫర్, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు మీర్




తారిఖ్ అలీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ఉండేందుకు మైక్రో అబ్జర్వర్స్‌గా గెజిటెడ్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఒకే సారి అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో జనరల్ అబ్జర్వర్ ఉండడం సాధ్యం కాదని, వారి ప్రతినిధిగా మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమీషన్/జిల్లా ఎన్నికల అధికారి ద్వారా అందజేసిన మెటీరియల్ ను చదివి అవగాహన కల్పించు కోవాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా జనరల్ అబ్జర్వర్స్ దృష్టికి తీసుకొని వస్తూ ఇబ్బంది లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది నమోదు చేసుకుంటున్న వివరాలను పరిశీలిస్తూ మీరు కూడా నోట్ చేసుకుంటూ సదరు వివరాలను క్రాస్ చెక్ చేసుకుంటూ ఉండాలని సూచించారు.
జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 2వ తేదిన కౌంటింగ్ అసిస్టెంట్స్, సూపర్వైజర్స్, మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ చేసి వారిని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగిందన్నారు. అందులో ఈవిఎం టేబుల్స్ కు ఒక మైక్రో అబ్జర్వర్, పోస్టల్ బ్యాలెట్ టేబుల్ పై ఒక మైక్రో అబ్జర్వర్ ఉండడంతో పాటు మిగతా టేబుల్స్ పై జనరల్ అబ్జర్వర్స్ ప్రతినిధులుగా కొంతమంది మైక్రో అబ్జర్వర్స్ ఉంటారన్నారు. ఈవిఎం కౌంటింగ్, మైక్రో అబ్జర్వర్స్ విధులపై ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ పై నోడల్ అధికారి సోమశేఖర్ రెడ్డి అవగాహన కల్పిస్తూ డమ్మీ పోస్టల్ బ్యాలెట్ లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ మైక్రో అబ్జర్వర్స్ కు అవగాహన కల్పించారు.సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, మైక్రో అబ్జర్వర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రికి ఎన్నికలకు కౌంటింగుకు సర్వం సిద్ధం







**నంద్యాల, జూన్ 3,ప్రభాతవార్తప్రతినిది :** సార్వత్రికి ఎన్నికలకు స ంబందించి రెండవ గట్టం నేటికితో ముగియనుంది, అందరూ ఎప్పుడెప్పుడా అంటు ఎదురు చూసిన కౌంటింగు గట్టం రానే వచ్చింది, మే 13 నుండి ఎంతో ఓర్పుతో ఎదురు చూసిన నాయకులు, ప్రజలు కార్యకర్తల టెక్షన్‌కు నేటితో తెర పడనుంది. 20 రోజుల పాటు నిత్యము ఎంతో వత్తిడికి గురి అయిన జనానికి నేటి ఉదయం 8గ ంటలతో ప్రారంభము అయ్యే కౌంటింగుతో ఊపిరి పీల్చుకోనున్నారు. జిల్లాలో మా నాయకుడు కాదు మానాయకుడంటూ పద్దెం రాయుళ్లల పందేలకు రూడా తెరదించనున్నారు రాష్ట్రంలో అదికారము తెలుగు దేశం,కాదు తిరిగి వైసిపిదే అంటు లక్షల్లో పందెలా కాచారు. వీరి డబ్బులకు రెక్కలు వచ్చే సమయం రానే వచ్చింది. వీరి పరిస్థితి ఇలా ఉంటే సార్వత్రిక ఎన్నికల అంకము ఎపుడు ముగుస్తుందా అంటు నిత్యము వత్తిడికి గురి అవుతున్న అదికారులకు కూడా నేటితో బిపి, సుగరు కంట్రోల్‌లోకి వస్తాయని అంటున్నారు అందుకే కౌంటింగు ప్రక్రియకు అదికారులు సర్వం సిద్దం చేశారు నంద్యాల పట్టణశివారుల్లోకి శాంతిరామ్ ఇంజనీరింగు, పార్మసి కాలేజిలో లెక్కింపుకు అన్ని ఏర్పాట్లను అదికారులు 20రోజుల పాటు శ్రమించి పూర్తి చేశారు. అలాగే పోలీసు వ్యవస్థ కూడా ఈ 20 రోజుల నుండి ఈవీయంలు దాచిన కేంద్రాల వద్ద పడుతున్న తీరు వర్ణణాతీతము. వీరికి కూడా నేటితో విముక్తి కలుగనుంది మొత్త ం మీద కౌంటింగుకు సర్వ సిద్దం అయింది.

## బస్సుపాసుల కౌంటర్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్
### -ఈనెల 8 నుంచి బస్సు పాసులు అందుబాటులో

**నంద్యాల విద్య, జూన్ 3, ప్రభాతవార్త:** పాఠశాలలు ఈనెల 12న తెరువనున్న సందర్భంగా విద్యార్థులకు బస్సు పాసుల కోసం కొత్త సాఫ్ట్‌వేరు అప్‌డేట్ చేస్తున్నట్లు ఆర్టీసి డిపో మేనేజరు అల్లాడి గంగాధర్ తెలిపారు. నంద్యాల డిపో పరిధిలోని గ్రామాల విద్యార్థులకు మరియు సీజనల్ టిక్కెట్ తీసుకునే ప్రయాణికులందరికి ఈనెల 8 నుంచి బస్సు పాసుల ప్రక్రియ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈనెల 6, 7 తేదిల్లో బస్సు పాసులు ఇవ్వడానికి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నందు వల్ల ఈనెల 6,7 తేదిల్లో పనిచేయదన్నారు. పాఠశాలలకు వెళ్లె విద్యార్థులు సీజనల్ టిక్కెట్ తీసుకునేవారు ఈ విషయాన్ని గమనించాని 8 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## రాఘవేంద్రరెడ్డి గెలవాలని కంబదహాల్‌లో ప్రత్యేక పూజలు



**పెద్దకడుబూరు,జూన్ 3,ప్రభాతవార్త :** మంత్రాలయం ఎమ్మెల్యేగా టిడిపి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో సోమవారం మురళీ యూత్ ఆద్వర్యంలో టిడిపి కార్యకర్తలు ఈశ్వరుని దేవాలయం,ఆంజనేయస్వామి దేవాలయం నందు 101కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి యువనేత మరళీకృష్ణ మాట్లాడుతూ నేడు వెలువడే ఫలితాల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై బిసి నేత రాఘవేంద్రరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఇందుకు ఈశ్వరుడు,ఆంజనేయస్వామి ఆశీస్సులు తమ అభిమాన నేతపై ఉండాలని పూజలు చేసినట్లు ఆయన విలేకర్లకు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వాల్మీకులతో పాటు అన్ని కులాల వారు ఎన్నికల్లో రాఘవేంద్రరెడ్డికి అండగా నిలిచారన్నారు. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ టిడిపి అధికార పీఠం దక్కించుకుంటుందని చెప్పాయని అన్నారు. చంద్రబాబునాయుడు సిఎం అయితే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని పేదవాళ్లకి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు
### - విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చు




**బనగానపల్లెరూరల్ ,జూన్ 3, ప్రభాతవార్త:** బలిజ, కాపు సేవా సమితి ఆధ్వర్యంలో నంద్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు పదవ తరగతి, ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బలిజ సేవా సంఘం, కాపు సమితి తరుపున 70 మంది విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అవార్డులు అందజేసినట్లు కాపు సేవా సమితి వ్యవస్థాపకులు దండె దస్తగిరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దండె దస్తగిరి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి కాపు సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను కాపులకు ఉపయోగపడేలా చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతోపాటు నగదు పారితోషాకాన్ని అందజేసినట్లు ఆయన తెలియజేశారు. అనంతరం సేవా సమితి అధ్యక్షులు కొప్పుల సుబ్బారెడ్డి మాట్లాడుతూ జంబులన్న ట్రస్ట్ ద్వారా వర్ధమశెట్టి రాజారామ్ దంపతుల సహకారంతో మరియు వేదుర్ల రామచంద్రరావు, పడకండ్ల సుబ్రహ్మణ్యం, రావూస్ సుంకన్న, మాజీ కౌన్సిలర్ కూరాకు రవిల ఆర్థిక సహకారంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వర్ధమశెట్టి రాజారామ్, ప్రముఖ న్యాయవాది వేదుర్ల రామచంద్రరావులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థుల చదువును ప్రోత్సహించే విధంగా నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కార కార్యక్రమానికి ఎల్లప్పుడు తమ వంతు సహాయ సహకారాలు దండె దస్తగిరికి అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. మాజీ కౌన్సిలర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని, వారు సమాజ అభ్యున్నతికి దోహదపడాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్బంగా సేవా సమితి ప్రధాన కార్యదర్శి దండె వెంకట నరేష్ మాట్లాడుతూ అదే విధంగా తమకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగపరుచుకుని తమ తల్లిదండ్రులకు, వారి చదివే పాఠశాలలకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా చదవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ప్రసాద్, టీచర్ శ్రీనివాసులు, రాజశేఖర్, ఆదినారాయణ, బుజ్జీ, విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెరగనున్న టోల్‌గేట్ చార్జీలు



**నంద్యాల విద్య, జూన్ 3, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సార ్వత్రిక ఎన్నికలు నిర్వహించిన వేళ వాహనదారులకు బిగ్‌షాక్ తగిలింది. టోల్ చార్జీలు సగటున 5 శాతం పెరగనున్నాయి. దేశవా ్యప్తంగా ఎంపీ ఎన్నికలు నిర్వహించిన సందర్బంగా చార్జీల పెంపు నిర్ణయం ఏప్రిల్ 1న పెంచుతామని ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది. కాగ కేంద్ర జాతీయ రహదారులు రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ చార్జీల పెంపు అంశాన్ని ఎన్నికల కమిషన్ వద్దకు తీసుకెళ్లింది. దీంతో ఈసి ఎన్నికల నేపధ్యంలో పెంపు నిర్ణయం వాయిదా వేయాలని అనాడు ఎన్‌హెచ్ఏను అదేశించింది. దీంతో కొత్త చార్జీల పెంపు ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. దేశవ్యాప్తంగా 7వ విడత పోలింగ్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఘట్టం శనివారంతో ముగిసింది. దీంతో రహదారుల ప్రాదికారిక సంస్థ అయినే ఎన్‌హెచ్ఏఐ కొత్త టోల్ చార్జీలను వసూలు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఆర్అండ్‌బి జాతీయ రహదారుల టోల్‌పై ఒకవైపు రూ.5లు, ఇరువైపుల రూ.10లు వసూలు చేయాలని సోమవారం నుంచే అమలులోకి వచ్చింది. పెంచిన ధరలు 2025 మార్చి 31వ తేది వరకు అమలులో ఉంటాయని నేషనల్ హైవే అధారిటి అఫ్ ఇండియా ప్రకటించింది. జాతీయ రహదారులపై చిన్నపాటి కమర్షియల్ వాహనాలు ఒకవైపు ప్రయాణానికి రూ.10 ఇరువైపుల కలిసి రూ.20లు, బస్సులు, ట్రక్కులకు ఒకవైపు ప్రయాణానికి రూ.25, ఇరువైపుల కలిపి రూ.35లు పెద్ద ట్రాన్స్‌ఫోర్టు వాహనాలకు ఒకవైపు ప్రయణానికి రూ.35లు, ఇరువైపుల కలిసి రూ.50 వరకు పెంచారు. నెలవారి పాస్‌ను 330ల నుంచి రూ.340లకు పెంచారు. దీంతో దూ ప్రాంతాలకు వెళ్లె ప్రయాణికులకు అధిక చార్జీల భారం పడనుంది.

## 144 సెక్షన్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు ; ఎస్ఐ




**గడివేముల, జూన్ 3, ప్రభాతవార్త** ఈనెల 4వ తేదీన మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు అనుమతి లేని వ్యక్తులు వెళ్లరాదని, కౌంటింగ్ కేంద్రాల వద్ద బయట నిలవడానికి కూడా వెళ్లరాదన్నారు. నలుగురు లేక అంతకుమించి కలిసి బయట తిరగరాదన్నారు. మండలకేంద్రానికి గానీ నియోజకవర్గ కేంద్రానికి గానీ వెళ్లరాదన్నారు. ఎలాంటి సంబరాలు చేసుకోరాదన్నారు. టపాసులపై పూర్తి నిషేధం ఉందన్నారు. 144 సెక్షన్ మరియు పోలీసు యాక్ట్‌లు అమలులో ఉంటాయని, ఆంక్షలు ఉల్లంఘించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## చంద్రబాబు సిఎం కావాలని కాశీవిశ్వనాథుని సన్నిధిలో హోమం

**ఆదోని,జూన్ 3,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కావాలని,ఆదోని ఎన్‌డిఏ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి విజయం కోసం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ ఆదేశాల మేరకు తెదేపా రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డేమాన్ గోపాల్ ప్రసిద్ధిగాంచిన వారణాసి కాశీ విశ్వనాథ స్వామి సన్నిదిలో హోమం నిర్వహించారు. వారణాసిలో వెలసిన కాశీ విశ్వనాథ ఆలయం నందు దుర్గ సప్తశతి హోమం,నవగ్రహ హోమం,గణపతి హోమంను చేశారు. అలాగే ఆదోనికి చెందిన గరుడాద్రి రామసుబ్బయ్య,కొండమడుగు విజయకుమారి,శ్రీకొండ కిరణ్ కుమార్,శ్రీరాములు పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని,ఆదోని అసెంబ్లీ ఎన్‌డిఏ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఆదోని నూతన ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలని,ఆంధ్రప్రదేశ్ నుంచి విభజించబడిన ఆంధ్ర రాష్ట్రం రాజధాని లేకుండా అస్తవ్యస్థంగా ఉందని,వైసిపి అరాచక పాలనలో రాష్ట్ర ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని అవన్నీ తీరిపోవాలంటే ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని,మరల ఆంధ్రప్రదేశ్ కార్యరూపం దాల్చాలని కాంక్షిస్తూ ఈ యాగాలు,హోమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
## - సీఐ గంటా సుబ్బారావు



**బనగానపల్లె ,జూన్ 3, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కానున్న నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంటా సుబ్బారావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో, మండల పరిధిలో ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించడం జరిగిందన్నారు. అలాగే ట్రైనీ డీఎస్పీ ్ర రఘువీర్ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్బంగా సీఐ గంటా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం 144సెక్షన్ మరియు 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో బనగానపల్లె సర్కిల్ పరిధిలో ఉన్న అని ్న గ్రామాల ప్రజలందరూ ఎక్కడైనా ముగ్గురు, నలుగురు గుంపులుగా ఉండకూడదని, తిరగకూడదని, బనగానపల్లె సర్కిల్ పరిధిలో పికెటింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసేవ వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసుల పెట్రోలింగ్ కూడా జరుగుతుందన్నారు. ఊరేగింపులు, ర్యాలీలు, సంబరాలు చేయడం, క్రాకర్లు కాల్చడానికి ఎలాంటి అనుమతిలేదని ఆయన తెలియజేశారు. బాణసంచాలు కాల్చిన, బాణసంచా విక్రయించిన అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారి పైనను చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.రామిరెడ్డి, కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు.. సర్వం సిద్ధం..!

(మొదటి పేజీ తరువాయి ) :

కౌంటింగ్ హాల్ వద్ద ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ హాల్ కి వెళ్ళే ప్రతి ఒక ఈవిఎమ్ కి కూడా ఏఆర్ ఎస్కార్ట్ ఉంటుందన్నారు.. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్ కాకుండా ఏ ఇతర వ్యక్తులు కూడా కౌంటింగ్ సెంటర్ లోకి ప్రవేశించకుండా 3 కట్ ఆఫ్ సెక్యూరిటీ పాయింట్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు .. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్ వాహనాలను కౌంటింగ్ హాల్ కి 200 మీటర్ ప్రాంగణంలో వెహికల్స్ పార్క్ చేయించి, మొబైల్ డిపాజిట్ చేసిన అనంతరం ఏఆర్ పోలీస్ టీమ్స్ మరల ఒక్కసారి చెక్ చేసి కౌంటింగ్ హాల్ లోకి పంపిస్తారన్నారు... కర్నూలు జిల్లాలో 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ ఆఫ్ పోలీస్ అమలులో ఉందనే విషయం గురించి పలుమార్లు పబ్లిసిటీ ఇవ్వడం కూడా జరిగిందన్నారు. కర్నూలు జిల్లా ముఖ్యమైన జంక్షన్ లతో పాటు, పల్లెలో కూడా 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ ఆఫ్ పోలీస్ గురించి ప్రచారం చేయిస్తున్నామన్నారు.. ట్రబుల్ మాంగర్స్ అందరిని ఐడెంటిఫై చేసి వారి మూమెంట్ ని కూడా ట్రాక్ చేస్తున్నామన్నారు.. గెలిచిన వారు ఎవరు కూడా ఫైర్ క్రాకర్స్, విక్టరీ మార్చ్ నిర్వహించేందుకు అనుమతులు లేవని తెలిపారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు..;

## మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



**బనగానపల్లె ,జూన్ 3, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండ వద్ద గల ఏపీ మోడల్ స్కూల్ నందు 2024-2025 విద్యా సంవత్స రానికి 7,8,9 తరగతుల్లో సీబీఎస్‌సీ మరియు ఇంగ్లిష్ మీడియంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సి.హెచ్.రామలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్బంగా రామలక్ష్మి మాట్లాడుతూ జూన్ 7వ తేది వరకు విద్యార్థుల నుండి దరఖాస్తులను పాఠశాల నందు స్వీకరిస్తారని జూన్ 8వ తేదిన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాఠశాల నందు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయిం చనున్నట్లు ఆమె తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి
### - రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న



**బనగానపల్లెరూరల్ ,జూన్ 3, ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయాధికారికి సోమన్న, సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలకృష్ణ, సహాయ కార ్యదర్శి మద్దిలేటి, ఇమామ్‌బాషాలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్బంగా సోమన్న మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, అన్ని రకాల విత్తనాలకు 90శాతం సబ్సిడీతో అందించాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని, ఎరువుల దుకాణాల్లో నకిలీ నీలి మందులను అరికట్టడంతోపాటు అన్ని దుకాణాలను సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని, అన్ని రకాల పంటలకు ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని, సహకార బ్యాంకుల ద్వారా రైతులకు వెంటనే పంట రుణ సదుపాయం కలి ్పంచాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా కౌలు రైతులకు అగ్రిమెంట్ ఆధారంగానే బ్యాంకు రుణసదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివనాగయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

# నేడే శ్రీశైలం నియోజకవర్గంలో
# అభ్యర్థుల గెలుపు ఓటమిపై ప్రజాతీర్పు...!

- : టిడిపి వైసిపి అభ్యర్థుల గెలుపు ఓటములపై ఉత్కంఠ
- : శ్రీశైలం నియోజకవర్గం ఏ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే పీఠం వరించెను
- : నేడు కౌంటింగ్ ప్రారంభం కావడంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నియోజకవర్గ ప్రజలు
- : ఏ పార్టీపై ఆ పార్టీ నాయకులు గెలుపు ధీమా వ్యక్తం
- : అధికారంలోకి శ్రీశైలం నియోజకవర్గం లో టిడిపి లేక వైసిపి అంటూ ప్రజల్లో చర్చలు
- : ఏ పార్టీ అభ్యర్థిని నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తారో వేచి చూద్దాం
- : శ్రీశైలం టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి గెలుప లేక వైసిపి అభ్యర్థి శిల్పా చక్రపాణి రెడ్డి గెలుప





**ఆత్మకూరు జూన్ 3 ప్రభాతవార్త :** గత నెల రోజుల నుంచి రాష్ట్రంలో అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు కొనసాగించి రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎమ్మెల్యే అభ్యర్థుల భవిత్యం తేలెందుకు నేడు ప్రజా తీర్పు వెలువడనుంది ఈ నేపథ్యంలోనే శ్రీశైలం నియోజకవర్గం లో టిడిపి అభ్యర్థిగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి బరిలో నిలిచారు వైసిపి అభ్యర్థిగా శిల్పా చక్రపాణి రెడ్డి ఎన్నికల బరిలో నిలిచారు మే 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో నేడు నంద్యాల జిల్లా కేంద్ర పరిధిలో కౌంటింగ్ ప్రారంభం కానుంది ఈ నేపథ్యంలోనే శ్రీశైలం నియోజకవర్గం లో ఏ పార్టీ అభ్యర్థికి ఎమ్మెల్యే పీఠం వరిస్తుందంటూ నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఒకవైపు వైసీపీ మరోవైపు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతోమంది కౌంటింగ్ కోసం ఎదురుచూస్తున్న సమయం నేటితో అభ్యర్థుల గెలుపు ఓటమిలు ఖరారు కానున్నాయి టిడిపి పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయం అంటూ ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు ఇదే తరహాలోనే వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణి రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం జరుగుతుందని ఆ పార్టీ నేతలు బీమా వ్యక్తం చేస్తున్నారు ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో జరిగిన రాజకీయాల పరిణామాల దృశ ఓటర్లు తమ ప్రజా నేతను ఏ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటున్నారో వేచి చూద్దాం... నేడు జరగబోయే కౌంటింగ్ లో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థివిజయం కోసం నియోజకవర్గ ప్రజలు ఎంతో ఉత్కంఠ గా ఎదురు చూస్తున్నారు

# టిడిపి కూటమి అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు



**తుగ్గలి,జూన్ 3,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావాలని,రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు,కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా బస్తిపాడు నాగరాజు,పత్తికొండ శాసనసభ్యులుగా కెఈ శ్యాంబాబులు అత్యధిక మెజార్టీతో గెలవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు ఆద్వర్యంలో సోమవారం మాజీ జడ్పిటిసి చైర్మన్ బత్తిన వెంకట్రాముడు,ఉపాధ్యక్షులు వెంకట్రాముడు చౌదరి, రైతుసంఘం నాయకుడు మనోహర్ చౌదరి,కృష్ణమూర్తి చౌదరి, ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడ్,సర్పంచ్ రాములు,విజయ్,మాజీ సర్పంచ్ వీరేష్‌లతో పాటు మరింతమంది టిడిపి నాయకులు,కార్యకర్తలతో కలిసి శ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని స్వామి వారికి 101కొబ్బరికాయలు కొట్టి,ఆకుపూజను చేయించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో కూడా నారా చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టు చేసిన సందర్భంలో జైలు నుండి చంద్రబాబు క్షేమంగా విడుదల కావాలని శ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని పూజలు చేసిన మరుసటి దినమే చంద్రబాబు జైలు నుండి విడుదలయ్యారని,ఆ నమ్మకంతోనే మరోసారి టిడిపి కూటమి అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కును చెల్లించుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వెంకటరాముడు,తెలుగు మహిళా మండలి అధ్యక్షురాలు ఈరమ్మ,బిసి సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ,వల్లే వెంకటేష్, కృష్ణయ్య, రాతన మైరాముడు,రాజేంద్రగౌడ్,కోటేశ్వర్ గౌడ్,శభాష్‌పురం మోహన్,సోమశేఖర్‌గౌడ్,నల్లగొండ రవి, మహేష్‌గౌడ్,ఎడవల్లి తిమ్మప్ప,ఏకాంత్, చిరంజీవితో పాటు మరింతమంది టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 40 మద్యం బాటిళ్లు స్వాధీనం



**చాగలమర్రి ,జూన్ 3, ప్రభాతవార్త:** 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండల కేంద్రమైన చాగలమర్రి పట్టణంలోని చాగలమ్మ ఆలయం వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఈ తనిఖీల్లో మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన నరసింహులును తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లు దొరికాయని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఈనెల 9న లాసెట్ పరీక్ష

**నంద్యాల విద్య, జూన్ 3, ప్రభాతవార్త:** ఏపీ లాసెట్ పరీక్షను జూన్ 9న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు లాసెట్ కన్వీనర్ ఆచార్య నాగార్జున యూనివర్శిటి నిర్వాహకులు తెలిపారు. హాల్‌టిక్కెట్‌లను ఆచార్య నాగార్జున యూనివర్శిటి అద్వర్యంలో ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్‌చేసుకొని హార్డ్ కాఫీని ప్రింట్ తీసుకొని లాసెట్ పరీక్షకు హాజరుకావాలి. యూనివర్శిటి నిర్వహించిన షెడ్యూల్ ప్రకారం ప్రొవిజనల్ అన్సర్ కీని జూన్ 10న విడుదల చేయనున్నారు. జూన్ 11న విడుదల చేసిన కీపై అభ్యంతరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈలాసెట్ పరీక్ష డిగ్రీ పాస్ మూడు సంవత్సరాల కోర్సు, ఇంటర్ పాస్ అయిన వారికి ఐదు సంవత్సరాల కోర్సును నమోదు చేసుకోవచ్చు.

## మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి -డిఎంహెచ్ఓ డా.ఆర్ వెంకటరమణ




**ఆళ్లగడ్డ, జూన్ 3, ప్రభాతవార్త:** ప్రజలు మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఆర్ వెంకటరమణ, డిఎంఓ వి కామేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం మలేరియా మాసోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ తాలూక రుద్రవరం మండల పరిధిలోని కోటకొండ సచివాలయం చిన్నయ్యస్వామి చెంచుగూడెం నందు డిడిటి 50 శాతం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఆర్ వెంకటరమణ, డిఎంఓ వి కామేశ్వర్‌రావు పర్యవేక్షించారు. అనంతరం మలేరియా వ్యాధి గురించి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో మంచినీటి ట్యాంకును 15 రోజులకోకసారి శుభ్రం చేయాలని దానికి సబంధించిన రికార్డును నిర్వహించాలని ఏ రోజు అయితే క్లీన్ చేస్తారో ఆ తేదిని నమోదు చేయాలని పంచాయితీ సెక్రెటరీని అదేశించారు. చిన్నయ్యస్వామి చెంచుగూడెంలోని 55 గృహాలకు స్ప్రేచేయించారు, ఈకార్యక్రమంలో రుద్రవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కుమారి జ్యోతి, నంద్యాల జిల్లా ప్రొగ్రామ్ అఫీసర్ కాంతారావు నాయక్, జిల్లా మలేరియా సహాయ అధికారి జి ప్రసాద్‌రెడ్డి ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ ఎంఎల్‌హెచ్‌పి సచివాలయం, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## భూమా అఖిలప్రియ గెలుపు కోరుతూ శివాలయంలో ప్రత్యేక పూజలు



**చాగలమర్రి ,జూన్ 3, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అత్యధిక మెజార్టీతో గెలవాలని చాగలమర్రిలోని పాత శివాలయం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అనస్వర్ బాషా ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.అన్సర్ బాషా మాట్లాడుతూ ఆళ్లగడ్డ అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఆళ్లగడ్డ తాలుకాలో భూమా అఖిలప్రియ గెలవాలంటే ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్ల నాగరాజు యాదవ్, వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి, గుత్తి నరసింహులు, అజీమ్, నూర్‌బాషా, రంగనాయకులు, కరీముల్లా, రమేష్, ఓబులేసు, చోటు, రమణాచారి, అనిఫ్, అబ్దుల్, మహీంద్రాచారి, వీరయ్య, రమణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 576 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం ..సెబ్ సిఐ భార్గవ్ రెడ్డి



**ఎమ్మిగనూరు క్రైం, జూన్ 04 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఎన్ఫోర్స్‌మెంట్ సూపరి ంటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని వివిధ కాలనీలలో జరిపిన దాడులలో ఇందిరా నగర్‌కు చెందిన బోయ తిక్కస్వామి అలియాస్ బుజ్జి, జయరాం, అదర్శ విద్యాపీఠం నందు బోయ గోపాల్ అనే వ్యక్తుల నుంచి 90 ఎంఎల్‌కు సంబంధించిన 576 టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిలను ఆరెస్టు చేసినట్లు ఎమ్మిగనూరు సెబ్ సిఐ భార్గవ్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ 576 టెట్రా ప్యాకెట్లు విలువ మార్కెట్‌లో రూ.37 వేలు ఉంటుందని తెలిపారు. ఈ ముగ్గురిని కోర్టుకు హాజరు పరచి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సత్యనారయణ, కానిస్టేబుల్స్ లింగ ప్రసాద్, గోపాల్, కానిస్టేబుల్స్ శ్రీనివాసులు గౌడ్, భరత్, నరసింహ రెడ్డి, రాధమ్మ, ఇందుమతిలు పాల్గొన్నారు. ప్రజలు అక్రమ మద్యం గురించి ఫిర్యాదు చేయాలనుకుంటే సెల్:9440960257 9కు ఫోన్ చేసి సమాచారం తెలియచేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## పండ్లతోటల పెంపకం-ఆర్థికాభివృద్ధికి సోపానం



**పత్తికొండ,జూన్ 3,ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు పండ్ల తోటలను విరివిగా పెంచుకోవాలని ఎంపిడిఓ రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగి 5ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు ఎవరైనా ఈ పథకం కింద పండ్ల తోటలు పెంచుకోవడానికి అర్హులని ఈ పథకం కింద మామిడి,జామ,సపోటా, నిమ్మ,నారింజ,దానిమ్మ వంటి మొదలగు 15రకాల పండ్లతోటలు,గులాబీ,మల్లె వంటి పూలతోటలు మరియు మునగవంటి తర్వాత ఆదాయాన్నిచ్చే పంట రకాలను 100శాతం రాయితీతో అందిస్తున్నామని తెలిపారు. దీనికి పంట రకాన్ని బట్టి మొక్క నాటుటకు గుంతలు తీయడం,మొక్కలు నాటడం,ఎరువులు పెట్టడం,నీటిని అందించడం,మొక్కల్ని సంరక్షించడం వంటి వాటిని 3సం॥లకు మెయిన్‌టేనెన్స్ ఉంటుందన్నారు. నీటివసతి కలిగిన వారు వర్షాధార రైతులు కూడా ఈ పథకానికి అర్హులేనన్నారు. దీని ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని అలాగే పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని తెలిపారు. కావున జాబ్‌కార్డు కలిగిన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ వెంకటేశ్వర్లు,జెఈ జిలాని,ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం పాల్గొన్నారు.

## పాఠశాలలు ప్రారంభము నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తాం - ఎంఈఓ సుభాన్



**పగిడ్యాల, జూన్ 3,ప్రభాతవార్త :** 2024-25 విద్యాసంవత్సరం పాఠశాలలు ప్రారంభము నాటికి " విద్యాకానుక " పథకం ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తామనీ మండల విద్యాధికారి పి.సుభాన్, మండల విద్యాధికారి - 2, మురళీమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ 8,9, 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు వచ్చాయనీ, 1వతరగతి, 7వతరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి రెండు విడతలు పుస్తకాలు రావలసివుందన్నారు. బెల్టులు వచ్చాయనీ, బూట్లు యూనిఫారం, బ్యాగులు రావలసివుందన్నారు.మండలంలో జెడ్పీపాఠశాలలు -4, ప్రాథమిక పాఠశాలలు 20, ప్రాథమికోన్నత పాఠశాలలు -2, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులబాలికపాఠశాల -1,మోడల్‌స్కూల్ -1, కస్తూర్బాపాఠశాల -1, మొత్తం 29 పాఠశాలలు ఉన్నాయనీ జూన్ 12 పాఠశాలలు ప్రారంభము కన్నా ముందు " విద్యాకానుక " కు సంబంధించి విద్యార్థులకు అందజేయవలసిన వాటిని అందజేస్తామనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, మండల విద్యాశాఖాధికారి -2, మురళీమోహన్‌రెడ్డి తెలిపారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దు



**హొళగుంద,జూన్ 3,ప్రభాతవార్త :** నేడు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోషల్ మీడియాలో ఎవ్వరు కూడా రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని ఎస్ఐ పెద్దయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డిజిపి హరీష్‌గుప్త ఆదేశాల మేరకు నేడు కౌంటింగ్ నేపథ్యంలో సోషల్ మీడియాపై స్పెషల్ ఫోకస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కొంతమంది సోషల్ మీడియా వేదికగా ప్రత్యర్థి శిబిరాలకు సవాల్ విసురుతూ వ్యక్తిగత దూషనలకు పాల్పడుతూ ఉద్రిక్తలు సృష్టిస్తున్నారన్నారు. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టులు,ఫోటోలు,వీడియోలు,వ్యక్తిగత దూషణలు వాట్సప్ స్టేటస్ పెట్టుకోవడం,షేర్ చేయడం వంటివి చేస్తే అట్టివారిపై ఐటియాక్ట్ కింద కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. అలాగే పిడియాక్ట్ ప్రయోగించడం వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోస్టులు ఎవరి ప్రోత్భలంతో పెడుతున్నారో కూడా విచారణ చేస్తామన్నారు. గ్రూపు అడ్మిన్లు అలర్ట్‌గా ఉండాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అలాగే కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు,బాణాసంచా కాల్చడం,డిజెలు,సాంస్కృతిక కార్యక్రమాలు,గుంపులుగా తిరగడానికి,వేడుకలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. మండలంలో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కావున పోలీస్ సిబ్బందికి ప్రతిఒక్కరు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

## టిడిపి నేత రమాకాంత్‌రెడ్డికి నోటీసులు జారీ

:- అధికార పీఠం టిడిపిదే :- టిడిపి నాయకులు,కార్యకర్తలు సమన్వయం పాటించాలి



**పెద్దకడుబూరు,జూన్ 3,ప్రభాతవార్త :** టిడిపి నేత రమాకాంత్‌రెడ్డికి ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సెక్షన్ 149కింద ఎస్ఐ మహేష్ కుమార్ తరుపున సోమవారం కానిస్టేబుల్ నాగరాజు ఆయన ఇంటికి వెళ్లి నోటీసులు అందచేశారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం రమాకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే రోజున తెలుగుదేశం ముఖ్య నాయకులు,కార్యకర్తలు సమన్వయం పాటించాలని అనవసరంగా గొడవల జోలికి వెళ్లొద్దని ఆయన కోరారు. వైసిపి నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా తెలుగుదేశం పార్టీ వారు ఎవరు కూడా రెచ్చిపోకుండ జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ టిడిపి పార్టీకి అనుకూలంగా వచ్చాయని అధికార పీఠం కూటమిదేనన్నారు.

## ఏ.పి.మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

**వెలుగోడు,జూన్ 3,ప్రభాతవార్త:** పట్టణంలోని ఏ.పి.మోడల్ స్కూల్ నందు 7,8,9, తరగతులలో మిగులు సీట్ల భర్తీకై ఆఫ్‌లైన్ పద్ధతిలో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని కావున ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 10వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష జరగుతుందని పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రధించాలని ప్రిన్సిపాల్ శ్రీమతి నళిని ఓ ప్రకటనలో తెలిపారు.

## కోడి పందెలు ఆడుతున్న పది మంది అరెస్ట్

**చాగలమర్రి ,జూన్ 3, ప్రభాతవార్త:** కోడి పందెలు ఆడుతున్న స్థావరాల పై చాగలమర్రి పోలీసులు సోమవారం మెరుపు దాడి చేశారు. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో చాగలమర్రి నుండి నారాయణపల్లెకు వెళ్లే రహదారి పొలాల్లో కోడి పందెలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడిచేశారు. ఈ దాడిలో చాగలమర్రికి చెందిన ఒకరు, ఆళ్లగడ్డకు చెందిన ఇద్దరిని, నంద్యాల, శిరువెళ్లకు చెందిన ఒక్కొక్కరిని, కడప జిల్లాకు చెందిన మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.5600 నగదును స్వాధీనం చేసుకున్నమన్నారు. వీరి పై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది శివకాంత్, శివారెడ్డి, బాలు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మళ్లీ సిఎం కావాలని వైస్ సర్పంచ్ ప్రత్యేక పూజలు



**పెద్దకడుబూరు,జూన్ 3,ప్రభాతవార్త :** నేడు వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైసిపి పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుని రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాలని పీకలబెట్ట వైస్ సర్పంచ్ నాగరాజు ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం గ్రామంలో కాశీ విశ్వేశ్వర స్వామికి అభిషేకం చేశారు. సిఎం గత ఐదేళ్ల పాలనలో ప్రతి పేద కుటుంబానికి ఎంతో మేలు చేశాడని ఆయన మరోసారి అధికార పీఠం చేపట్టేలా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి నాల్గవసారి వరుసగా భారీ మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని పూజలు చేయడం జరిగిందని స్వామి వారి ఆశీస్సులు ఉండాలని అభిషేకం చేయించినట్లు వైస్ సర్పంచ్ నాగరాజు విలేకర్లకు తెలిపారు.

## కంది విత్తనాల కోసం రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోండి - ఎంఏవో



**బేతంచెర్ల ,జూన్ 3, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో కంది సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జి.కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. వివరాల మేరకు 30శాతం రాయితీతో ఆశ రకం 20క్వింటాళ్లు, ఎల్‌ఆర్‌జీ 105 రకం 10క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**నంద్యాల, జూన్3,ప్రభాతవార్తప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లాకలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అదికారి డాక్టరు కె.శ్రీనివాసులు వెల్లడించారు సోమవారము కలెక్టరేట్లఒనివీడియో కాన్ఫరెన్సు హాలులో ఓట్ల లెక్కింపు పోస్టల్ బ్యాలెట లెక్కింపు పై రాజకీయల పార్టీల ప్రతినిదులతో సమావేశము నిర్వహించారు.ఈసందర్భముగా కలెక్టరు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలెట్లుఇ లెక్కించడము జరుగుతుందని అనంతరము 30నిమిసాల తర్వాత ఈవీయం కౌంటింగు మొదలవుతుందని కౌంటింగు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రాజకీయల పార్టీల ప్రతినిదులు ఏజెంట్లు సహకరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబందించి ఎలక్షన్ కమీషన్ కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారము లెక్కింపు జరుగుతుందని కలెక్టరు తెలిపారు.పోస్ట్ ద్వారా వచ్చి కలెక్టరేట్లోస్టోరేజ్ చేసిన సర్వాసు ఓటర్లు ఈటీపిబియస్ పోస్టల బ్యాలెట ఓట్లను మంగలవారము ఉదయం 5గంటలలకు అర్జియంలోకి ఓట్ల లెక్కింపు కేంద్రానికి తీసుకునివెల్లుతామని రాజకీయ పార్టీల ప్రతినిదులు హాజరుకావాలని కలెక్టరు తెలిపారు. కౌంటింగు కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు క్యాలిక్యులేటర్లు ఇతర సాంకేతిక పరికరాలను అనుమతించమని ఈవిషయాన్ని గుర్తెగిరిరాజకీయ పార్టీల ప్రతినిదులు ఏజెంట్లు నడుచుకోవాలన్నారు.

## అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే అమాత్య పదవి షూర్

**బేతంచెర్ల ,జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకున్న డోన్ నియోజకవర్గంలో పోటీచేసిన ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ అభ్యర్థి గెలిస్తే అమాత్య పదవి షూర్ అన్నది తేటతెల్లమవుతుంది. నియోజకవర్గంలోని అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ నుండి ఎమ్మెల్యే అభ ్యర్థిగా ప్రస్తుత రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి బరిలో ఉన్నారు. వీరితోపాటు మరో 15 మంది వివిధ పార్టీల నుండి బరిలో ఉన్నప్పటికి రెండు ప్రధాన పార్టీల మధ్యే హోరాహోరీ పోటీ కొనసాగుతుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోను రెండు ప్రధాన పార్టీల మధ్యే ్య అధికారం దోబుచులాటడుతుంది. నేడు ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ అభ్యర్థి నియోజకవర్గంలో విజయం సాధిస్తే అమాత్య పదవి షూర్ అన్న వాదన కొనసాగుతుంది. ఇరువురు అభ్యర్థులు కూడా ఆయా పార్టీల్లో కీలక పాత్ర వహించే వ్యక్తులు కనుక మంచి హోదా కలిగిన మంత్రిత్వ శాఖనే వరిస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే ఓటరు తీర్పు ఎలా ఉందో అన్నది ఉత్కంఠగా మారింది. ఏది ఏమైనా అధికార పార్టీ అభ్యర్థి గెలుపొంది అమాత ్య పదవి నియోజకవర్గానికి లభిస్తే ఎంతో కొంత అభివృద్ధి చెందేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల కోసం వేచి చూడాల్సిందే.

## మాజీ ఎంపిటిసి భౌతికకాయానికి నివాళులర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన



**బేతంచెర్ల ,జూన్ 3, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన మాజీ ఎంపిటిసి కట్టుబడి మహమ్మద్ రఫీ(52) భౌతికకాయానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైన మహమ్మద్ రఫీ మృతి చెందడంతో సమాచారం అందుకున్న ఆర్థిక మంత్రి ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. మంత్రితోపాటు రాష్ట్ర గిడ్డంగులశాఖ డైరెక్టర్ బాబుల్‌రెడ్డి(సురేంద్రనాథ్‌రెడ్డి), నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ముర్తుజావలి, మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ ఖాజా ఉసేన్, మాజీ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, వైసీపీ నాయకుడు బుగ్గన చంద్రారెడ్డి, పిట్టల జాకీర్ ఉసేన్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నేడు షాపులు బంద్



**బేతంచెర్ల, జూన్ 3, ప్రభాతవార్తః** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా శాంతిభద్రతల దృష్ట్యా ఈనెల 4వ తేదిన దుకాణాల నిర్వాహకులు, ఇతర వ్యాపార సంస్థలు బంద్‌ను పాటించి సహకరించాలని సిఐ ప్రియతమ్‌రెడ్డి సోమవారం కోరారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా పోలీస్ చట్టాలు అమలులో ఉన్నాయని వాటికను గుణంగా ప్రతిఒక్కరు నడుచుకోవాలని కోరారు. దుకాణాలు, ఇతర వ్యాపారాల వల్ల వచ్చిపోయే వారిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని గుర్తించేందుకు ఇబ్బందిగా మారుతుందని అందుకు గాను ప్రతిఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అల్లర్లకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవు

### - సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి



**వెల్దుర్తి,జూన్3,ప్రభాతవార్త :** ఈనెల4న ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తున్న నేపధ్యంలో ఎవరైనా సరే అల్లర్లకు పాల్పడితే చట ్టపరమైన చర్యలు తప్పవని వెలు ్దర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు.స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన సోమవారం వెల్దుర్తి ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గత నెల మే13న శాసనసభ,లోక్‌సభ ఎన్నికలు జరిగిన నేపధ్యంలో భారత ఎన్నికల సంఘం జూన్4న మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తున్నామని ప్రకటించిన విషయం అందరికి తెలిసిందేనన్నారు.గెలుపు ఓటములు సహజమని గెలిచిన వారు సంబరాలు చేసుకోవడం,ర్యాలీలు నిర్వహించడం,బాణసంచా కాల్చడం వంటివి ఎన్నికల కోడ్‌తో నిషేధించబడ్డాయన్నారు.వీటికి ఎటువంటి అనుమతులు లేవన్నారు.ఎన్నికల కోడ్ జూన్6వ తేదివరకు ఉంటుందని అప్పటి వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.ఇద్దరికి మించి గుంపులుగా ఉండడం చేయరాదన్నారు.ఏదైనా అత్యవసర పని ఉంటే వచ్చి వెళ్లిపోవాలని సిఐ ప్రజలకు సూచించారు.రెచ్చగొట్టే మాటలు మాట్లాడి లేనిపోని గొడవలు సృష్టిసే ్త అటువంటి వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ చేయాల్సి వస్తుందన్నారు.ఎన్నికల కోడ్ అమలులో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజలు పోలీస్‌శాఖకు సహకారం అందించారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# అపరిశుభ్రతకు నిలయం .. ఆర్‌టిసి ప్రాంగణం

- పందుల స్వైర విహారం
- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు





**మంత్రాలయం,జూన్ 3,ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశంలో రెండవ తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం ఆర్‌టిసి బస్టాండ్ అపరిశభ్రతకు నిలయంగా మా రింది.బస్టాండ్‌లో ఎటువైపు చూసినా చెత్తా,చెదారంతో నిండి ఉంటుంది.మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకోవడానికి దేశంలోని వివిధ ప్రాంతాలైన బెంగళూరు,హైదరాబాద్,చెన్నై,ముంబై అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో నుండి బస్సులు వెళుతున్న పక ్కలోనే ప్రతినిత్యం డ్రైనేజీనీరు,వ ర్షపునీరు మోకాళ్ళ లోతులో నిల్వఉంటాయి.ఈ నీటిలో ప్రతినిత్యం పందులు,దోమలు,కుక్కలు స్వైరవిహారం చేస్తుంటాయి. తద్వారా బస్టాండ్ ఎల్లప్పుడూ దుర్గంధంతో నిండిఉంటుంది.ఈ దుర్వాసనతో ప్రయాణికులు,శ్రీ రాఘవేంద్రస్వామి భక్తులు,ప్రజలు అనారోగ్యాలకు గురయి తీవ్ర అవస్థలుపడుతున్నారు.బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు అనేకమార్లు అధికారుల దృష్టికి తెలియజేసినా అధికారులుల పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## కౌంటింగ్‌లో ఏవరి ధీమా వారిదే

### - ఏపీ నాయకుల్లో ఎగ్జిట్‌పోల్ టెన్షన్



**నంద్యాల విద్య, జూన్ 3, ప్రభాతవార్తః** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలపై గతంలో ఎన్నడు లేనంత ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు నువ్వా, నేనా అన్నట్లు సాగడమే ఇందుకు ప్రధాన కారణం. పోలింగ్ ముగిసిన వెంటనే విజేతలు ఏవరనే దానిపై సస్పెన్స్ మొదలయినా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎగ్జిట్ పోల్స్‌తో దీనిపై స్పష్టత వస్తుందని భావించినా అందులోను సేమ్ సీన్ కనిపించడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చింది. పలు సంస్థలునిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో ఉమ్మడి కూటమిలో గెలుపుతథ్యమంటుంటే మరిన్ని ఎగ్జిట్‌పోల్స్‌లో వైసీపీదే విజయం అంటుంటే మరిన్ని మాత్రం ఏపీలో కింగ్ కూటమే అని అంచనా వేశాయి. దీంతో గత 20 రోజులుగా ఫలితాలపై కొనసాగుతున్న ఉత్కంఠ పెరిగిపోయింది. భిన్నమైన అంచనాలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ రాజకీయ పార్టీ శ్రేణులను కన్ఫ్యూజన్‌లో పడేశాయి. తమకు అనుకూలంగా ఉన్న ఎగ్జిట్‌పోల్స్ నిజమవుతాయని ప్రత్యర్థులకు అనుకూలంగా ఉన్న ఎగ్జిట్ పోల్స్ ఫేక్ అంటూ నేతలు విమర ్శలు గుప్పించారు. ఎగ్జిట్‌పోల్స్ గందరగోళంగా ఉన్నాయని లోకల్ సర్వేలు తమకు పాజిటివ్‌గా ఉన్నాయని వైసీపీ తెలిపింది. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఇక కూటమి అభ్యర్థులతో విడియోకాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎగ్జిట్ పోల్స్ అంచనా కూటమికే సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించబోతున్నామన్నారు. వైసీపీ అల్లర్లకు పాల్పడే అవకాశం ఉందని కౌంటింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని నేతలు సూచించారు. రాష్ట్రంలో కేంద్రంలో ఎన్‌డియే విజయం ఖాయమన్నారు. బిజెపి నేత సిఎం రమేష్ కౌంటింగ్‌లో కూటమి ఏజెంట్లు ఏవరు సహనం కోల్పోవద్దని సూచించారు. మొత్తానికి తుది ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ క్లియర్ పిక్చర్ ఇవ్వకపోవడంతో ఫలితాలు వెలువడే వరకు నేతలందరు ఉత్కంఠంగా వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. నేడు వెలువడనున్న ఫలితాల కోసం ఆసక్తిగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఎదురుచుస్తున్నారు. ఉమ్మడి కూటమి అభ్యర్థులు కార్యకర్తలు, నాయకులు సోమవారం నాడే సంబరాలకు సిద్దమయ్యారు.

## ఎలక్షన్ రిజల్ట్ అనే లింక్‌తో ఫైబర్ నేరగాళ్ళ వల




**నంద్యాల విద్య, జూన్ 3, ప్రభాతవార్తః** ఇది ఎన్నికల సీజన్ కాబట్టి ఫైబర్ మోసగాళ్లు వివిధ రకాలతో వల వేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా ఎలక్షన్ అనే రిజల్ట్ పిడిఎఫ్ లింక్‌ల్లో, వాట్సాప్ గ్రూప్ లో ఫైబర్ నేరగాళ్లు ఫేక్ లింక్‌లను పంపుతున్నారు. ఏవరు ఆ లింక్‌లను ఓపెన్‌చేసినా మీ బ్యాంకుల డిటైల్స్ ఫైబర్‌నేరగాళ్ళ చేతిలోకి వెళ్లిపోతాయి. వారి వెంటనే మీ ఖాతాలోని వివరాలతో సహా వారిచేతుల్లోకి వెళ్లడంతో మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నిధులన్ని కాజేస్తున్నారు. ఇటీవల నంద్యాలకు చెందిన ఒక వ్యక్తికి వాట్సాప్ గ్రూప్‌లో నకిలీ ఏనో యాప్‌ను పంపారు. ఆ వ్యక్తి ఏనో యాప్‌ను ఓపెన్ చేయడంతో ఆతని ఖాతాలో దశల వారిగా రూ.5 లక్షలు నగదును మాయం చేశారు. నకిలీ లింక్‌లను యాప్‌లను అరికట్టెందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతే ్యక చర్యలు తీసుకునేందుకు రంగం సిద్దం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు అధికారులు కోరుతున్నారు. ఏదైనా వాట్సాప్‌లో నకిలీ లింక్‌లు వస్తే వెంటనే 1930 నంబరుకు, లేదా పోలీస్ అధికారులకు తెలపాలని వారు కోరుతున్నారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు



**ఆదోనిటౌన్, జూన్03, ప్రభాతవార్త;** పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సోమవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదోని డీయస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. డీయస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీయస్పీ ధీరజ్, సీఐలు తేజమూర్తి, గోపీ, నరసింహరాజు, మంజునాథ్, నిరంజన్‌రెడ్డి, విజయలక్ష్మి, ఎస్‌ఐలు మధుసూదన్, చిన్నపీరయ్య, శ్రీనివాసులతో పాటు పోలీసు బలగాలతో సమస్యాత్మక ప్రాంతాల్లోని పురవీధులగుండా పోలీసు కవాతు చేశారు. నేడు కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా ఉండేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు డీయస్పీ తెలిపారు. మంగళవారం కౌంటింగ్ ఉండడం వల్ల 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ బయటికి రావొద్దన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు తమ పిల్లలను ఎవరినీ బయటికి పంపవద్దని, ఇళ్లల్లో టీవీలు చూసుకుంటూ ఉండేలా బాధ్యత తీసుకోవాలన్నారు. హెవీ మోటార్‌సైకిళ్లు, భారీ శబ్దాలతో మోటార్ సైకిళ్లపై తిరగరాదన్నారు. బయట గుంపులు గుంపులుగా సమావేశాలు ఏర్పాటు చేయరాదన్నారు. గెలుపు, ఓటములపై ఎలాంటి ఘర్షణలు చేసుకోరాదన్నారు. అంతేగాకుండా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందు వల్ల గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలు పేల్చకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలతో పాటు వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీయస్పీ హెచ్చరించారు.

## మిడుతూరు మండలంలో భారీ వర్షం....

**మిడుతూరు, జూన్03, ప్రభాతవార్త;** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు ఆరంభమయ్యాయి. రుతుపవనాలు ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిశాయి. అదేవిధంగా మిడుతూరు మండలంలో సోమవారం తెల్లవారుజామున నుంచి భారీ వర్షం కురవడంతో పలుచోట్ల రహదారులు, పొలాలు జలమయం అవడమేకాకుండా వాగులు, వంకల్ల వర్షపునీరు భారీగా పారింది. వేసవి అనంతరం రుతుపవనాల ప్రభావంతో వర ్షం మొదలుకావడంతో వడగాల్పులు వేడి నుంచి కొంత ఉపశమనం లభించింది. మిడుతూరు మండలంలో 54.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు.



## ముందుగా ప్రవేశించిన నైరుతిపవనాలు

### - ఆదివారం రాత్రి కురిసిన వర్షం
### - పగిడ్యాల మండలంలో 38.6శాతం వర్షపాతం నమోదు



**పగిడ్యాల, జూన్ 3,ప్రభాతవార్త :** మండుతున్న ఎండలకు ప్రజలు విలవిలలాడిపోయారు. వర్షం ఎపుడువస్తుందా అనీ వర్షం కోసం ఎదురు చూశారు నేపథ్యంలో ముందుగా ప్రవేశించిన నైరుతి పవనాల కారణంగా అదివార రాత్రి నుండి సోమవారం తెల్లవారు జామువరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు.ముఖ్యంగా రైతులు తమ పోలాలను సేద్యం చేసుకునేందుకు వర్షం ఎంతో ప్రయోజనకరంగా వుందనీ రైతులు తెలిపారు. పగిడ్యాల మండలంలోని వివిధగ్రామాలలో వర్షం దోడ్లుపారేవిధంగా వర్షం కురిసింది. మండలంలో 38.6శాతం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షపాతానికి మండల కేంద్రమైన పగిడ్యాల గ్రామ సచివాలయం వద్ద పల్లంగా వుండటంతో వర్షం నీరు నిలిచిపోయింది. ఈ పాటి వర్షానికి వర్షంనీరు నిలిచిపోయిందంటే వర్షాకాలంలో భారీ వర్షాలు పడితే పరిస్థితి ఎలా వుంటుందో అనీ సచివాలయం తమ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీరవోలు బ్రిడ్జిపై వర్షం నీరు నిల్ల వుండటంతో బాటసారులు,ద్విచక్రవాహనం దారులు ఇబ ్బందులకు గురవుతున్నారు. వర్షంపు నీరు బ్రిడ్జిపై నిల్వ వుండటంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో పక్కనే నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పర్యవేక్షణలేనందున పదికాలాలపాటు వుండవలసిన నిర్మాణాలు కొద్దిసంవత్సరాలకు శిథిలావస్థకుచేరుకుటున్నాయనీ స్థానికులు పేర్కొంటున్నారు. మండుతున్న ఎండలకు సతమతమైపోతున్న నేపథ్యంలో ముందుగానే ప్రవేశించిన నైరుతి పవనాలకారణంగా వర్షం పడటంతో ప్రజలు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



**ఆదోని రూరల్,జూన్ 3,ప్రభాతవార్త :** ఈ నెల 28,29 తేదీల్లో పట్టణంలో జరుగు సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యండి ఆనంద్ బాబు కోరారు. సోమవారం కెవిపిఎస్ మండల,పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు కడితోట దావీదు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు,మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ గోపాల్,మండల అధ్యక్ష,కార్యదర్శులు మునిస్వామి,తిక్కప్పలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి దళితులు ఆర్థిక,సామాజిక సమానత్వానికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. రిజర్వు స్థానాల నుండి గెలుపొందిన ఎస్‌సి ప్రజాప్రతినిధులకు సైతం ఆ భాదలు తప్పడం లేదన్నారు. సామాజిక తరగతుల మద్య ఐక్యత,చైతన్యం పోరాటం ద్వారా మాత్రమే వాటిని తిప్పికొట్టగలమన్నారు. గ్రామీణ ప్రాంతాల నండి పట్టణ ప్రాంతాల వరకు ఉన్న సామాజిక ఉద్యమ కారులందరిని సమీకరించి 2024జూన్ 28,29న సామాజిక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. తరగతుల జయప్రదానికి అన్ని రకాల సహాయ,సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ పట్టణ నాయకులు,మల్లికార్జున,యువరాజు,మండల నాయకులు,లక్ష్మన్న,చక్రవర్తి,తాయన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.